ఆకాశం అరుణమై.. అవనికి ఆభరణమై..



శీతాకాలం ప్రారంభ వేళ కమ్ముకున్న మంచు తెరలు తెల్లవారుజామున మెల్లగా వీడిపోతున్నాయి.. మబ్బులు చీల్చుకొని ఉదయిస్తున్న సూర్యుడి లేలేత కిరణాలతో ఆకాశం ఎరుపెక్కింది.. ఉదయ భానుడిని స్వాగతిస్తున్న చెట్ల మధ్య నుంచి పచ్చటి పొలాలు కనువిందు చేస్తున్నాయి.. సుల్తానాబాద్ శివారులో గురువారం ఉదయం 6.15 గంటల సమయంలో ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.

-న్యూస్‌టుడే, సుల్తానాబాద్

ఆయిల్‌పామ్ సాగును వేయి ఎకరాలకు పెంచాలి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: డిసెంబరు నాటికి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని వేయి ఎకరాలకు పెంచాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కల గ్రౌండింగ్‌పై గురువారం ఆయన సమీకృత పాలనా ప్రాంగణంలో సమీక్షించారు. ఈ ఏడాది జిల్లాలో 350 ఎకరాల్లో మొక్కలు నాటడం లక్ష్యం కాగా ఈ మేరకు ఉద్యాన శాఖ అధికారులు కార్యాచరణ చేపట్టాలన్నారు. సాగుకు ముందుకొచ్చే రైతుల నుంచి బిందుసేద్యం పరికరాలకు డీడీలను సేకరించాలన్నారు. జిల్లా ఉద్యాన అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, ఏడీఏ కాంతారావు, జ్యోతి తదితరులున్నారు.

అత్యుత్తమ సదుపాయాలు.. మెరుగైన నిర్వహణ

ఖని వైద్య కళాశాలలో వివిధ రాష్ట్రాల విద్యార్థులు



గోదావరిఖని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

విశాలమైన భవనాలు... ఎయిర్ కండీషనింగ్ తరగతి గదులు... మెరుగైన నిర్వహణ... తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణలోని వివిధ వైద్య కళాశాలల్లో చదువుతున్న కేరళకు చెందిన సుమారు 1500 మంది విద్యార్థులు 'తెలంగాణ-మల్లు' పేరిట ఏర్పాటు చేసుకున్న వాట్సప్ గ్రూపుల్లో ఆయా కళాశాలల్లోని వసతులు, విద్యాబోధన తీరును వివరిస్తున్నారు. తాజాగా 2024-25 బ్యాచ్‌లోను కేరళకు చెందిన ఏడుగురు విద్యార్థులు చేరారు. ఉత్తరప్రదేశ్, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాల నుంచి సైతం విద్యార్థులు అధిక సంఖ్యలో చేరారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో 150 సీట్లు ఉండగా అందులో జాతీయ కోటాకు 22 సీట్లు కేటాయించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఆయా రాష్ట్రాల్లోని ప్రముఖ కళాశాలల్లో సీట్లు వచ్చే అవకాశమున్నప్పటికీ గోదావరిఖనిలోని వైద్య కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపారు. రాష్ట్రంలోని 28 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రథమ ప్రాధాన్యతగా గోదావరిఖని వైద్య కళాశాలను ఎంచుకోవడం గమనార్హం. 2024-25 విద్యా సంవత్సరంలో గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చేరిన వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 'న్యూస్‌టుడే'తో పంచుకున్న అంశాలివీ...

సీనియర్ల సూచనలు...



ఇప్పటికే గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుకుంటున్న కేరళకు చెందిన సీనియర్ల ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం. తెలంగాణలోని వైద్య కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని కళాశాలల నిర్వహణ, వసతులు, బోధనపై చర్చించుకుంటాం. దాని ప్రకారం గోదావరిఖనిలోని వైద్య కళాశాలలో మంచి వసతులు, ఉత్తమ బోధన ఉందని ఎక్కువగా సూచనలు వచ్చాయి. దూరమైనా సరే ఇక్కడే చేరాలనుకున్నాం. ఇక్కడికి వచ్చాక వసతులు చూశాక మరింత సంతృప్తి చెందాం. ప్రిన్సిపల్‌తో పాటు ప్రొఫెసర్లు, వార్డెన్లు, ట్యూటర్లు ఎంతో ఆప్యాయత చూపుతున్నారు.

-అతుల్‌కృష్ణ, అనఘ, త్రిషూర్(కేరళ)

ఉత్తమ కళాశాల ఇదే...



జాతీయ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొందాలనుకునే వారు తెలంగాణలో మొట్టమొదటగా గోదావరిఖని వైద్య కళాశాలనే ఎంచుకుంటారు. మా రాష్ట్రానికి చెందిన సీనియర్లు ఇక్కడ ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లో సీటు వచ్చే అవకాశమున్నప్పటికీ గోదావరిఖని వైద్య కళాశాలలో వసతులు, నిర్వహణ తీరు నచ్చడంతో ఇక్కడే చేరాను. రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్‌లోనూ గోదావరిఖని వైద్య కళాశాలకు మంచి గుర్తింపు ఉంది.

- అభిషేక్ కార్తికేయన్, ప్రయాగరాజ్(ఉత్తర ప్రదేశ్)

సర్వీసు నిబంధన లేకపోవడంతో...



ఎంబీబీఎస్ పూర్తయిన తర్వాత తప్పనిసరిగా ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేయాలనే నిబంధన లేకపోవడంతో తెలంగాణలోని వైద్య కళాశాలల్లో చేరాలనుకున్నా. కళాశాల నిర్వహణ, ఫలితాలు, భవనాలు, వసతులు తదితర అంశాలను పరిశీలించాక గోదావరిఖని వైద్య కళాశాలలో చేరడమే ఉత్తమమని నిర్ణయించుకున్నా. ర్యాగింగ్ లాంటి సమస్యలు లేవు. బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించే ప్రొఫెసర్లు ఉండటంతో మొదటి రెండు బ్యాచ్‌లు ఉత్తమ ఫలితాలు సాధించాయి. వీటిని పరిశీలించిన అనంతరం నేను ఇక్కడ చేరా. ఇక్కడ సౌకర్యవంతమైన భవనాలు, వసతులు అందుబాటులో ఉన్నాయి.

- సయ్యద్ రేహాన్‌అలీ, పూంచ్ (జమ్మూ కశ్మీర్)

నాలుగు నెలలు.. 7,583 దరఖాస్తులు

భూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక చొరవ



పెద్దపల్లి రెవెన్యూ కార్యాలయంలో వివరాలు సరి చేస్తున్న తహసీల్దారు, సిబ్బంది

రెండేళ్ల నిరీక్షణ ఫలించింది



నా తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన 3 ఎకరాల భూమికి పహాణీ, ఎన్ బీ తదితర అన్ని రికార్డుల్లో నా పేరే ఉంది. ఆన్‌లైన్‌లో మరొకరి పేరు కనిపిస్తుండటంతో సరి చేయాలని 2022లో దరఖాస్తు చేశా. పలుమార్లు అధికారులను కలిసినా పట్టించుకోలేదు. ఆధారాలు అన్నీ ఉన్నా పట్టా లేదు. ఇటీవల కలెక్టర్‌ను కలిసి విన్నవించగా అన్ని పత్రాలు చూసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇరవై రోజుల్లో డిజిటల్ పత్రాలు చేతికొచ్చాయి. -ధనలక్ష్మి, పెద్దపల్లి

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

'కళ్ల ముందే భూమి కనిపిస్తున్నా మరొకరి పేరుపై పట్టా హక్కులుంటాయి.. సాగులో ఉన్నా ఆన్‌లైన్‌లో ఇతరుల పేరిట భూమి ఉండటంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి.. ప్రభుత్వం సేకరించిన భూమి కూడా నిషేధిత జాబితాలో చేరడంతో క్రయ విక్రయాలకు అనుమతించటంలేదు..' ఇలా వివిధ రకాల భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాలు తొలగిపోతున్నాయి. ధరణి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేపట్టిన కార్యాచరణ సత్ఫలితాలిస్తోంది. ఏళ్ల తరబడి నిరీక్షించిన అన్నదాతల చేతికి పట్టా హక్కులు అందుతున్నాయి.

16,900 తిరస్కరణ

ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చాక వివిధ భూ సమస్యలపై జిల్లావ్యాప్తంగా 46,196 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 28,782 పరిష్కరించారు. మీసేవలో చేసిన పిర్యాదుల్లో వివరాలు తప్పుగా ఉండటం, ఆధారాలు లేకపోవడం తదితర కారణాలతో 16,900 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 514 పరిష్కరించాల్సి ఉంది. నాలుగు నెల కిందట కలెక్టర్‌గా శ్రీహర్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత 7,583 దరఖాస్తులకు మోక్షం లభించింది. సాదాబైనామా, కోర్టు కేసులు పెండింగ్, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉండటంతో కొన్ని పరిష్కారానికి నోచుకోలేదు. మరికొన్నింటికి ఐచ్ఛికాలు(ఆప్షన్లు) రావాల్సి ఉంది.

ఎందుకీ సమస్యలు!

- ధరణి నమోదు సమయంలో సిబ్బంది చేసిన పొరపాట్లు రైతులకు శాపంగా మారాయి.
- ప్రభుత్వం సేకరించని భూములు కూడా సంబంధిత సర్వే నంబర్ల ఆధారంగా నిషేధిత జాబితాలోకి చేరాయి.
- ఒకరి పేరిట ఉన్న యాజమాన్య వివరాలు ఆన్‌లైన్‌లో మరొకరి పేరిట నమోదు కావడం.
- భూమిపై పూర్తి హక్కులున్నా నోషనల్ ఖాతా(ఎలాంటి ఆధారాలు లేని సర్వే నంబర్లు)లో చేరడం.
- పట్టా భూములను ప్రభుత్వ భూములుగా చూపడం.
- వివరాలన్నీ సక్రమంగా ఉన్నా డిజిటల్ సంతకం చేయకపోవడంతో ఆలస్యం కావడం.

ఇదీ కార్యాచరణ

- భూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. దరఖాస్తులను మండలాల వారీగా విభజించి పరిష్కారంపై తరచూ సమీక్షిస్తున్నారు.
- ప్రగతి లేని మండలాల్లో కారణాలు తెలుసుకొని అడ్డంకులను ఎలా అధిగమించాలో దిశానిర్దేశం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కింది స్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు.
- పాసు పుస్తకంలో తండ్రి పేరు, కులం, ఆధార్ వివరాలు, ఫొటోల్లో తప్పులుంటే సవరిస్తున్నారు.
- ఒక సర్వే నెంబరులోని పది ఎకరాల విస్తీర్ణంలో నలుగురికి పట్టాదారు పాసుపుస్తకాలుంటే అందులో ఒకరి విస్తీర్ణంలో కొంత వ్యత్యాసం ఉన్నా మిగిలిన ముగ్గురి భూముల లావాదేవీలు నిలిచిపోయాయి. ఇలాంటి వాటిని త్వరితగతిన సవరిస్తున్నారు.
- విస్తీర్ణంలో తప్పులు, పట్టా భూమికి బదులు ప్రభుత్వ భూమిగా నమోదవడం, భూ సేకరణ చేయని సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలోకి చేరడం వంటి సమస్యలన్నింటినీ పాత రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తున్నారు. నోషనల్ ఖాతాల నుంచి తొలగించి యాజమాన్య హక్కులు కల్పిస్తున్నారు.

దీపావళి బోనస్.. ఆరు దశాబ్దాల ప్రస్థానం

న్యూస్‌టుడే, గోదావరిఖని

బొగ్గుగని కార్మికుల దీపావళి(పీఎల్ఆర్) బోనస్ పంపిణీకి ఆరు దశాబ్దాల ప్రస్థానం ఉంది. గని కార్మికుల శ్రమను గుర్తించి దీపావళి ఒకసారి బోనస్ చెల్లించాలన్న డిమాండ్‌పై 1962లో తొలిసారిగా గని కార్మికులకు రూ.300 బోనస్ చెల్లించారు. ఏఐటీయూసీ నాయకుల పోరాటం చేసి బోనస్ ప్రయోజనాన్ని సాధించారు. అప్పటి నుంచి ఏటా దీపావళికి కార్మికులకు బోనస్ చెల్లిస్తూ వస్తున్నారు. దీనిపై 1965లో పార్లమెంటులో చట్టం తీసుకొచ్చారు. ప్రతి సంవత్సరం గని కార్మికులకు బోనస్ చెల్లించాలని పార్లమెంటులో బిల్లు ఆమోదమైనప్పటి నుంచి దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు దీనిని అమలు చేస్తున్నారు. ఈ ఏడాది 93,750 చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. గత సంవత్సరం రూ.85,500 చెల్లించారు.

కార్మికులకు నేడు చెల్లింపు

గోదావరిఖని: సింగరేణి ఉద్యోగుల ఖాతాల్లో శుక్రవారం పీఎల్ఆర్ బోనస్ జమ చేసేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. కోల్ ఇండియా కార్మికులకు దసరా ముందు చెల్లించారు. సింగరేణి కార్మికులకు ఆనవాయితీ ప్రకారం దీపావళి పండుగ ముందు చెల్లిస్తారు. ఈ క్రమంలోనే శుక్రవారం బోనస్ పంపిణీ చేసేందుకు నిర్ణయించినట్లు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వి.సీతారామయ్య, బి.జనక్ ప్రసాద్‌లు తెలిపారు.

సరిహద్దు రాష్ట్రాల పోలీసు అధికారులతో సీపీ భేటీ



పోలీసు ఉన్నతాధికారులతో సీపీ శ్రీనివాస్

గోదావరిఖని, న్యూస్‌టుడే: మూడు రాష్ట్రాల సరిహద్దు పోలీసు అధికారులతో రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ గురువారం సమావేశమయ్యారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులు గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో డీఐజీ అంకిత్‌గోయల్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావం.. వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టుల వద్ద నిత్యం తనిఖీలు నిర్వహించాలని, మూడు రాష్ట్రాల పోలీసులు పరస్పరం సమాచారాన్ని పంచుకుంటూ సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఆజయ్‌శర్మ, ఆసిఫాబాద్, భూపాలపల్లి ఎస్పీలు డీవీ శ్రీనివాసరావు, కిరణ్‌ఖరే, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏఎస్పీ ఎ.ఎస్‌.పి. చిత్తరంజన్, పెద్దపల్లి ఏసీపీ ఎం.రమేష్, సీఐ రామచందర్ రావుతో పాటు రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎవరికి వారే!

రసవత్తరంగా జగిత్యాల రాజకీయం

కాంగ్రెస్ శ్రేణుల్లో కలవరం



'నేను నమ్ముకున్న నా కాంగ్రెస్ పార్టీ నుంచి నాకు అగౌరవం ఎదురవుతోంది. ఒకరకంగా ఇది నేను అవమానకరంగా భావిస్తున్నా. ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న పార్టీ వైఖరి వల్ల కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. నాలాంటి వాళ్లు తీవ్ర నిరాశ నిస్పృహల లోనవుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నా భవిష్యత్తు కార్యాచరణ మీరే మార్గదర్శనం చేయగలరు.'

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదన

'జగిత్యాల అభివృద్ధే నా అజెండా. ప్రస్తుతం ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నా. అవసరమైతే నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంటా. రోళ్లవాగు ప్రాజెక్ట్ నిర్మాణం సహా కీలకమైన ప్రగతి ఇంకా జగిత్యాలకు అందాలి. నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తా. ఫిరాయింపులతో హత్యలు జరుగుతున్నాయని విమర్శించిన వారి తీరును ఖండిస్తున్నాను. నేనెంటో ఇక్కడి ప్రజలకు తెలుసు.'

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ఈనాడు, కరీంనగర్

జగిత్యాల కాంగ్రెస్‌లో రసవత్తర రాజకీయ పోరు సాగుతోంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా జగిత్యాలలో కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా పార్టీలో ఆయన నాయకత్వానికి మాత్రం ఎదురు లేదు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరడం.. ఇద్దరు నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత గంగారెడ్డి హత్యతో జీవన్‌రెడ్డి పార్టీపై చేసిన విమర్శలు.. ఫిరాయింపులతో వచ్చిన నాయకుల వల్లే ఈ పరిస్థితి అని ఆరోపణలు చేయడం కలకలం రేపింది. పరోక్షంగా ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకున్నారన్న అభిప్రాయం కలిగించింది. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సందిగ్ధావస్థలో పడేసింది. పార్టీ పెద్దల తరఫున అధికారంలోకి వచ్చిందన్న ఆనందంలో ఉన్న సమయంలోనే ఈ పరిణామాలు పార్టీ వారు కలవరపడుతున్నారు.

ఆవేదనలో జీవన్‌రెడ్డి..

సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాగా.. తాను ఓడిపోవడంతో నిరాశకు గురయ్యారు. తరువాత లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ స్థానం నుంచి బరిలోకి దిగి పరాజయం పాలవడంతో రాజకీయంగా మరింత ఇబ్బంది పడ్డారు. ఎమ్మెల్సీ పదవిలో కొనసాగుతుండటంతో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ముందుకెళ్తున్న ఆయన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో షాక్ తిన్నారు. తనపై గెలిచిన వ్యక్తిని పార్టీలో చేర్చుకుంటున్నట్లు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై కినుక వహించారు. పార్టీ పెద్దల వైఖరిని తప్పుబట్టిన ఆయనను మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు పార్టీ పెద్దలు బుజ్జగించారు. తరువాత పార్టీ కార్యక్రమాల్లో మునుపటిలా పాల్గొంటున్నారు. కానీ గతంలోలా తన అనుచరులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నానన్న ఆవేదన ఆయనలో ఉందని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఆయన ముఖ్య అనుచరుడైన గంగారెడ్డి దారుణ హత్యకు గురవ్వడం ఆయనను తీవ్రంగా బాధపెట్టింది. ఈ క్రమంలోనే బహిరంగంగానే పార్టీ వైఖరిని విమర్శించడం.. తాజాగా పార్టీ జాతీయాధ్యక్షుడికి లేఖరాయడంతో ఆయన రాజకీయ అడుగులెటు అన్న చర్చ సాగుతోంది.

కలవని చేతులు...

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఈ ఏడాది జులైలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఆయన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో నేరుగా కలిసిన సందర్భాలు ఒకట్రెండు మాత్రమే ఉన్నాయి. ఈ సందర్భంలోనూ వీరిద్దరు ఎడమొఖం పెడమొఖంగానే ఉన్నట్లు సమాచారం. ఒకే పార్టీలో ఉంటున్నా రాజకీయంగా ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి తన పాత క్యాడర్‌తో కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటుండగా.. ఎమ్మెల్యే హోదాలో డాక్టర్ సంజయ్ తన అనుచర వర్గంతో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్నారు. కానీ రాజకీయంగా ఎవరికి వారే పై చేయి సాధించాలనే వ్యూహాలు, ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. ఇటీవల కొన్ని సార్లు ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలోనూ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వర్గాల మధ్య వివాదం రేగి ఫిర్యాదులు పోలీసు స్టేషన్ దాకా వెళ్లాయి. మరోవైపు కొన్ని గ్రామాల్లో రెండు వర్గాల పోరు ఇంతకింతకు పెరుగుతుండటం ఆ పార్టీ శ్రేణులను గందరగోళ స్థితిలో పడేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో ఎవరిది పై చేయి అవుతుంది.. ఎవరు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు ఎటువైపునకు దారితీస్తాయనేది రాజకీయ విశ్లేషకులకు కూడా అంతుచిక్కడం లేదు.

విపణికి తీసుకొచ్చిన రోజే తూకం



- మూడు నాలుగు రోజుల్లో ఖాతాల్లో నగదు జమ
- నాణ్యత పాటిస్తే పత్తికి మంచి ధర: డీఎంవో ప్రవీణ్‌రెడ్డి

న్యూస్‌టుడే, పెద్దపల్లి

గతంలో ఎదురైన సమస్యలను గుణపాఠంగా తీసుకుని పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. దళారుల ప్రమేయం లేకుండా వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదైన రైతు వివరాల ఆధారంగా మార్కెట్‌కు వచ్చిన రోజే తూకం వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పత్తి కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. తూకం, నగదు చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ఈ సీజన్‌లో మార్కెటింగ్ శాఖ తీసుకుంటున్న చర్యలు, సమస్యల పరిష్కారానికి చేపట్టిన కార్యాచరణపై డీఎంవో 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వెల్లడించారు.

ప్రశ్న: పత్తి కొనుగోలు ప్రక్రియలో అక్రమాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: దళారుల ప్రమేయం లేకుండా తప్పుడు రైతు మార్కెట్‌కు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఆధార్ నెంబరు ద్వారా వ్యవసాయ శాఖ క్రాప్ బుకింగ్ పోర్టల్ నుంచి వివరాలు తీసుకుంటున్నాం. ఈ ప్రక్రియలో ఆధార్ సీడింగ్ ఓటీపీ లేదా ఐరిస్ ఆధారంగా రైతు నిర్ధారణ జరుగుతుంది. రైతు వ్యక్తిగతంగా రాలేని పరిస్థితుల్లో ఆతడి అంగీకార పత్రంతో ఇతరులను అనుమతిస్తాం.

ప్ర: మద్దతు ధర పెరిగిన నేపథ్యంలో సీసీఐకే ఎక్కువ మంది రైతులు విక్రయించే అవకాశముంది. జిల్లాలో ఎన్ని కేంద్రాలు అందుబాటులో ఉంచారు?

జ: పత్తి కొనుగోళ్లకు జిల్లాలో నాలుగు జిన్నింగ్ మిల్లులను సిద్ధం చేశాం. వీటితో పాటు పెద్దపల్లి మార్కెట్‌లోనూ సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. సీసీఐ కేంద్రాల్లో రోజుకు ఆయా కేంద్రాల సామర్థ్యం మేరకు పత్తి కొనుగోళ్లు ఉంటుంది. కేంద్రాల్లో రైతులకు మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస వసతులతో పాటు విశ్రాంతికి అవసరమైన ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా ఏ రోజు తీసుకొచ్చిన పత్తిని అదే రోజు తూకం వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: రైతులు పత్తి విక్రయానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: పత్తి విక్రయంపై ఎప్పటికప్పుడు తాజా పరిస్థితి తెలిపేలా 'సేల్ మార్కెటింగ్ శాఖ వాట్సాప్' నెంబరును అందుబాటులోకి తెచ్చింది. ఈ నెంబరు(88972 81111)కు మార్కెటింగ్ శాఖలో నమోదైన రైతు ఫోన్ నెంబరు నుంచి హాయ్ అని టైప్ చేస్తే అవసరమైన సమాచారం వస్తుంది. రైతు ఎన్ని పర్యాయాలు, ఎంత పరిమాణంలో విక్రయించారు? డబ్బులు ఎప్పుడు ఖాతాలో జమవుతాయి? తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

ప్ర: మార్కెట్‌కు పత్తిని తీసుకొచ్చే రైతులకు మీరిచ్చే సూచనలు?

జ: పత్తిలో నీళ్లు చల్లకుండా తీసుకురావాలి. తేమ శాతం 8-12 మధ్య ఉండేలా చూసుకోవాలి. పంటను తెగుళ్లు సోకితే నాణ్యమైన పత్తిని వేరు చేసి తెస్తే మంచి ధర పలుకుతుంది.

ప్ర: గతంలో సీసీఐకి విక్రయించిన రైతులకు రెండు, మూడు నెలల వరకు డబ్బులు రాలేదు. ఈ పరిస్థితిని ఎలా చక్కదిద్దుతారు?

జ: ఆధార్ అనుసంధానం కలిగిన బ్యాంకు ఖాతాలోకే సీసీఐ నుంచి నగదు జమవుతుంది. గతంలో ఆధార్ సీడింగ్ సమస్యలతో కొంత జాప్యమైంది. ఈ పరిస్థితులు రాకుండా ముందస్తుగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కొనుగోలు చేసిన మూడు, నాలుగు రోజుల్లో ఖాతాల్లో నగదు జమవుతుంది.

ప్ర: ఈసారి జిల్లాలో పత్తి దిగుబడి ఎలా ఉంది? ఇతర జిల్లాల నుంచి వచ్చే పత్తిని సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేస్తారా?

జ: గత సంవత్సరం కంటే ఈ ఏడాది పత్తి దిగుబడి పెరిగే అవకాశముంది. గతంలో 3 లక్షల క్వింటాళ్ల పత్తిని మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేయగా, ఈ సీజన్‌లో 3.5 లక్షల-4 లక్షల క్వింటాళ్లు విక్రయానికి వచ్చే అవకాశముంది. ఇతర జిల్లాల నుంచి పత్తి తీసుకురావద్దనే నిబంధన ఏదీ లేదు. రైతుల పేరిట దళారుల అక్రమాలను నియంత్రిస్తాం. నిబంధనల మేరకు రైతులు విక్రయానికి తెస్తే కలెక్టర్ అనుమతితో కొనుగోలు చేపడతాం.

పేదల గృహావసరాలకు ఇసుక ఉచితంగా అందించాలి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి మాదిరిగానే మంథని నియోజకవర్గంలో పేదల గృహ నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని జడ్పీ మాజీ ఛైర్మన్ పుట్ట మధుకర్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌కు వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లిలో సాండ్ ట్యాక్సీ లేకుండా ఇసుకను ఉచితంగా అందిస్తున్నారని, మంథనిలో ఈ పరిస్థితి ఎందుకు లేదని ప్రశ్నించారు. అక్కడి నుంచి లారీల్లో ఇసుకను తరలిస్తున్నప్పటికీ మంత్రి నోరు మెదపడం లేదన్నారు. పేదలకు ఇసుకను ఉచితంగా ఇచ్చే విధానాన్ని అమలు చేయాలన్నారు.

పెరుగుతున్న భూ వివాదాలు

◆ విక్రయించిన వ్యవసాయ భూములకు పాసుపుస్తకాలు
◆ ఇళ్ల స్థలాలకూ రెండు, మూడుసార్లు రిజిస్ట్రేషన్లు



న్యూస్‌టుడే, మల్యాల

జగిత్యాల జిల్లాలో భూవివాదాలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. కొందరు స్థిరాస్తి వ్యాపారులు, దళారుల మాయాజాలంతో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో చాలా ఏళ్ల కిందట విక్రయించిన భూములను తాము విక్రయించలేదని పేర్కొంటూ కొందరు వ్యక్తులు గొడవలకు దిగుతున్నారు. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న మల్యాల మండలంలోని ముత్యంపేట, కొండగట్టు, బల్వంతాపూర్, మల్యాల అడ్డరోడ్డు, నూకపల్లి, రాజారం తదితర గ్రామాల పరిధిలోని భూములకు డిమాండు ఏర్పడటంతో కొందరు వ్యక్తులు తాము విక్రయించిన భూమిని మళ్లీ మరో వ్యక్తికి విక్రయించడంతో వివాదాలకు దారితీస్తోంది. రాజకీయ నాయకులు కూడా భూముల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్‌తో మోసాలకు పాల్పడుతున్నారు.

■ కొండగట్టు ప్రాంతంలో ఘాట్ రోడ్డు పక్కన నిర్మించిన దుకాణ భవన సముదాయంలోని గదులను ఓ స్థిరాస్తి వ్యాపారి ఒక్కో గదిని రూ.5 లక్షల వరకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించినట్లు పలువురు బాధితులు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కొండగట్టుకు చెందిన మరో వ్యక్తి తనకు చెందిన ఓ ప్లాట్‌ను ముగ్గురు వ్యక్తుల పేర విక్రయించడంతో పోలీసులు సదరు వ్యక్తిపై మోసం కేసు నమోదు చేశారు. ఈ విధంగా కొండగట్టు ప్రాంతంలో పలువురు వ్యక్తులు అక్రమంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

■ మల్యాల అడ్డరోడ్డు, నూకపల్లి, రాజారం శివారులోని వ్యవసాయ భూములు ఇళ్లప్లాట్లకు అనుకూలంగా ఉండటంతో పట్టణ ప్రాంతాలకు చెందిన వైద్యులు, బడా వ్యాపారులు ఎకరాకు రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. భూములను రిజిస్ట్రేషన్ చేసుకొన్నప్పటికీ మళ్లీ భూయజమానులు అది తమ తాతల నాటి భూమి అని దానిని తాము విక్రయించలేదని పేర్కొంటూ నకిలీ దస్త్రాలు సృష్టించి కొత్తగా రెవెన్యూ అధికారుల నుంచి పాసు పుస్తకాలు పొందుతుండటం పెద్ద సమస్యగా మారుతోంది.

■ భూముల కొనుగోలు తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు సదరు భూమిని రెవెన్యూ కార్యాలయంలో 'మ్యుటేషన్' అమలు చేసుకోకపోతే నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని దళారులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ విధంగా మల్యాల మండలంలో పదుల సంఖ్యలో ఇటీవలే భూవివాదాలు చోటుచేసుకున్నాయి. గతంలో రెవెన్యూ కార్యాలయంలో పనిచేసిన కొందరు వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర వ్యక్తులకు చెందిన భూములను వారికి తెలియకుండా తమ పేర లేదా కుటుంబ సభ్యుల పేర నమోదు చేసుకోవడంతో బాధితులు ఇప్పటికీ న్యాయం చేయాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

మోసాలకు పాల్పడేవారిపై చర్యలు

భూములకు సంబంధించి సరైన పత్రాలు కలిగి ఉండి, మోఖాపై ఉండే వ్యక్తుల భూముల ఆక్రమణకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మోసాలకు పాల్పడే వ్యక్తులపై కేసు నమోదు చేయడం తోపాటు అసలైన భూయజమానులకు రక్షణ కూడా కల్పిస్తాం. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న భూములకు రేట్లు అధికంగా ఉండటంవల్ల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డ పలువురిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం.

- నీలం రవి, మల్యాల సీఐ

అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా చూస్తాం

మల్యాల మండలంలో కొందరు అక్రమంగా భూముల రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు, మరి కొందరు తమ భూమిని విక్రయించినా తాజాగా పాసుపుస్తకాలు పొందినట్లు మా దృష్టికి రావడంతో చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ రిజిస్ట్రేషన్ల గురించి మా దృష్టికి తీసుకొస్తే బ్లాక్ చేయిస్తాం. గతంలో ధరణిలో ఒకరిభూమి మరొకరి పేర రిజిస్ట్రేషన్ చేశారు. ఈసీ పరిశీలించి పరిష్కరిస్తున్నాం.

- మునిందర్, తహసీల్దారు, మల్యాల

రూ.500 బోనస్ ఇచ్చే సన్నరకాలు

ప్రభుత్వం ప్రకటించిన వంగడాలు




న్యూస్‌టుడే, గంగాధర

ఎన్నికల హామీలో భాగంగా క్వింటాలు సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని రాష్ట్ర సర్కారు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఏ రకం వంగడాలకు బోనస్ వస్తుందోనన్న సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతోంది. వాటిని నివృత్తి చేసేందుకు ప్రభుత్వం 33 రకాల వంగడాలు గుర్తించింది. మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఈ మేరకు ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్నారు. అయితే జై శ్రీరామ్ సూపర్ ఫైన్ రకం ప్రభుత్వం గుర్తించిన వంగడాల్లో లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. వాస్తవానికి ఈ రకం ధాన్యానికైనా, బియ్యానికైనా మార్కెట్లో మంచి డిమాండు ఉంది. ప్రభుత్వం అందించే మద్దతు ధర, బోనస్‌కు అదనంగా రైస్‌మిల్లర్లు చెల్లించి కొనుగోలు చేస్తారు. లేదా ధాన్యం మర పట్టించి బియ్యం అమ్మినా అంతకు రెట్టింపు ధర రైతులకు గిట్టుబాటు కానుంది. గింజ పరిమాణం కొలిచి నాణ్యమైన ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని పౌరసరఫరాల శాఖ డీఎం రజనీకాంత్ తెలిపారు. ఒకవేళ జాబితాలో లేకున్నా జైశ్రీరామ్ రకంవి తెస్తే.. కొనుగోలు చేస్తామని చెప్పారు.

కొనుగోలు కేంద్రాల్లో సేకరించే ధాన్యం రకం

- సిద్ధి (డబ్ల్యూజీఎల్ 44)
- కంపసాగర్ వరి-1 (కేపీఎస్ 2874)
- సాంబ మసూరి (బీపీటీ-5204)
- జగిత్యాల వరి-3 (జేజీఎల్ 27356)
- జగిత్యాల వరి-2 (జేజీఎల్ 28545)
- వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్ 14)
- వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్ 32100)
- జగిత్యాల మసూరి (జేజీఎల్ 11470)
- పొలాస ప్రభ (జేజీఎల్ 384)
- క్రిష్ణ (ఆర్ఎన్ఆర్ 2458)
- మానేరు సోనా (జేజీఎల్ 3828)
- తెలంగాణ సోనా (ఆర్ఆఎన్ఆర్ 15048)
- వరంగల్ వరి- 1119
- కూనారం వరి-02 (కేఎన్ఎం 1638)
- వరంగల్ వరి-02 (డబ్ల్యుజీఎల్ 962)
- రాజేంద్రనగర్ వరి-4 (ఆర్ఎన్ఆర్ 21278)
- కూనారం వరి-1 (కేఎన్ఎం 733)
- జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798)
- జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844)
- కరీంనగర్ సాంబ (జేజీఎల్ 3855)
- అంజన (జేజీఎల్ 11118)
- నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449)
- ప్రత్యుమ్న (జేజీఎల్ 17004)
- సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465)
- శోభిని (ఆర్ఎన్ఆర్ 2354)
- సోమ్‌నాథ్ (డబ్ల్యుజీఎల్ 347)
- ఆర్ఎన్ఆర్ 31479 (పీఆర్‌సీ)
- కేపీఎస్ 6251 (పీఆర్‌సీ)
- జేజీఎల్ 33124 (పీఆర్‌సీ)
- హెచ్ఎంటీ సోనా
- మారుతీరు సాంబ (ఎంటీయు 1224)
- మారుతీరు మసూరి (ఎంటీయు 1262)
- ఎంటీయు 1271

మళ్లీ నురగ... కలుషిత జలాలతో బెంగ



గోదావరిఖని కోల్‌బెల్ట్ వంతెన వద్ద నదిలో తేలిన నురగ

పవిత్ర గోదావరినదిలో నీటిపై నురగ మళ్లీ పేరుకుంటోంది. ఎల్లంపల్లి గేట్లు ఎత్తివేయడంతో దిగువకు రెండు రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. నీటి ప్రవాహం లేకుండా ఎండిపోయి ఉన్న గోదావరినదిలో ప్రస్తుతం జలకళ సంతరించుకున్నప్పటికీ గురువారం ఉదయం నీటిపై నురగ తేలడంతో పవిత్ర స్నానాలకు వెళ్లే వారు ఆందోళనకు గురయ్యారు. గోదావరినది పరిసర ప్రాంతాల నుంచి కలుషిత జలాలు నదిలో చేరడం వల్లే నీటిపై నురగ తేలుతుందని స్థానికులు అంటున్నారు. నగరంలో వినియోగించిన నీటితో పాటు పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలు నేరుగా నదిలో చేరడం వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందని అంటున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమకు చెందిన రసాయన వ్యర్థాలు సైతం నేరుగా గోదావరినదిలోకి చేరడంతో నురగ వస్తోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గోదావరినది పవిత్రతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గోదావరిఖని**

ఎమ్మెల్యే గంగులకు కేటీఆర్ పరామర్శ



ఎమ్మెల్యే కమలాకర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

రాంపూర్(కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మరణించడంతో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ ఆయన్ను గురువారం పరామర్శించారు. లక్ష్మీనర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమలాకర్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతిపై వారికి సానుభూతి తెలియజేశారు. కమలాకర్‌తోపాటు పలువురు నాయకులతో కాసేపు కేటీఆర్ మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, పెద్దపల్లి జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జడ్పీ ఛైర్‌పర్సన్ వసంత, మాజీ ఎమ్మెల్యేలు రసమయి, రవిశంకర్, బాల్క సుమన్, మేయర్ వై.సునీల్‌రావు, భారాస జిల్లా అధ్యక్షుడు జి.వి.రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు హరిశంకర్, జడ్పీ మాజీ ఛైర్మన్ తుల ఉమ, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు కమలాకర్‌ను పరామర్శించారు. అనంతరం కేటీఆర్, ఎమ్మెల్యేలు, నాయకులు కమలాకర్ ఇంట్లో భోజనం చేశారు. అనంతరం కేటీఆర్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లారు.

స్వల్పంగా తగ్గిన పత్తి ధర

జమ్మికుంట : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. యార్డుకు 172 ట్రాలీల విడి పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో కనిష్ఠంగా రూ.6,500 గరిష్ఠంగా రూ.6,750 ధర పలికింది. 32 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా రూ.6,000 నుంచి రూ.6,400 దాకా ధర పలికింది. బుధవారం కంటే తాజాగా పత్తి ధర రూ.50 తగ్గింది. తేమ శాతంతో ధర తగ్గిందని మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. బిడ్డింగ్‌ను మార్కెట్ ద్వితీయ శ్రేణి కార్యదర్శి రాజా పరిశీలించారు. స్థానిక మార్కెట్‌లో సీసీఐ 4 ట్రాలీల పత్తిని ఖరీదు చేసిందని ఆయన చెప్పారు.

పట్టభద్రులూ మేల్కోండి

ఓటరు నమోదుకు కదలండి ◆ మరో 13 రోజులే గడువు





న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్, వెల్గటూరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి ఎన్నికల ప్రచార సందడి రోజురోజుకు పెరుగుతోంది. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేశారు. పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలుస్తూ.. ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. కానీ ఓటరు నమోదు ప్రక్రియ మాత్రం నత్తనడకన సాగుతోంది. దరఖాస్తుల స్వీకరణకు నవంబరు 6వ తేదీ వరకు గడువు ఉండటంతో 13 రోజులే మిగిలి ఉంది. ఇకనైనా అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు నమోదుకు కదలాల్సిన అవసరముంది.

నమోదు కేంద్రాలు వెలవెల..


జిల్లాల్లోని అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారిని నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. అయినా ఆదరణ అంతంతా మాత్రంగానే ఉంటోంది. దీపావళి పండగ అనంతరం నమోదు ప్రక్రియ వేగం పుంజుకోనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కరీంనగర్ గ్రామీణ మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటరు నమోదు బ్యానర్

ఉపాధ్యాయుల్లోనూ స్పందన అంతంతే..

సాధారణంగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో కొనసాగే వారు నమోదులో ముందుంటారని ఎవరైనా భావిస్తుంటారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు విషయంలో మాత్రం ఆ వర్గాలు ఆసక్తి చూపడంలేదని తాజా గణాంకాలను చూస్తే తెలుస్తోంది. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా నమోదు పత్రాలు అందజేసినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. మండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే కొత్తగా అర్హులందరూ దరఖాస్తు సమర్పించాలి. ఇప్పటివరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయులు 1761, పట్టభద్రులు 66,743 ఓటర్లుగా నమోదు చేసుకున్నారు.



ఓటరుగా ఎవరు నమోదు చేసుకోవచ్చు..

పట్టభద్రులు ఓటు నమోదు (ఫారం-18 చేసుకోవాలంటే) 2021 అక్టోబరు 31 వరకు డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకులైతే 2018 నవంబరు వరకు మూడేళ్లకు తగ్గకుండా ఉన్నత పాఠశాల, కళాశాల స్థాయి విద్యాసంస్థల్లో పని చేసి ఉండాలి. వారు ఫారం-19తో ఓటరు నమోదు చేసుకునే వీలుంటుంది. చరవాణిలోనూ.. ఉన్న చోట నుంచే ఓటరు నమోదు చేసుకునే అవకాశం సైతం ఎన్నికల కమిషన్ కల్పించింది. అందుకు www.ceotelangana.nic.in వెబ్‌సైట్‌ను ప్రవేశపెట్టింది. పట్టభద్రులు ఫారం-18, ఉపాధ్యాయులైతే ఫారం-19 దరఖాస్తును పూరించి గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలతోపాటు ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే మీరు ఓటరుగా నమోదైనట్లే.

దళారుల చేతిలో పత్తి రైతుల దగా



ఇతర ప్రాంతాలకు తరలించేందుకు వ్యాన్‌లో నింపిన పత్తి

న్యూస్‌టుడే, వేములవాడ

పత్తి రైతులు గ్రామాల్లో దళారుల చేతిలో మోసాలకు గురవుతున్నారు. ఇప్పటికే మొదటి దఫా పత్తి సేకరణ చేసిన రైతుల నుంచి దళారులు కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో కాంటాలు పెట్టి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 42,390 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేయగా 30,028 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే జిల్లాలో పత్తి సేకరణ ఊపందుకుంది. ఇప్పటికే జిల్లాలోని చాలా గ్రామాల్లో రైతుల వద్ద దళారులు తక్కువ ధరకు భారీ ఎత్తున పత్తి కొనుగోలు చేస్తూ ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారు.

సీసీఐ కేంద్రాల ఏర్పాటుతోనే ప్రయోజనం

భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఇంకా జిల్లాలో ప్రారంభించకపోవడంతో దళారులకు కలిసొస్తుంది. ఇదే అదనుగా పత్తి రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు ప్రయోజనం కలగనున్నది. జిల్లాలో సుద్దాల, నాంపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, తాళ్లపల్లి ఐదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించినప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. 8 నుంచి 12 శాతం తేమతో ఉన్న పత్తికి సీసీఐ క్వింటాల్‌కు రూ.7,521 నుంచి రూ.7,421 వరకు పింజ పొడవును బట్టి ధరను చెల్లిస్తుంది. గ్రామాల్లో దళారులు తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పి రూ.6 వేల నుంచి రూ.6,200లకే కొంటున్నారు. పత్తి విక్రయానికి రైతులకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో దళారులు చెప్పిందే ధర అన్న చందంగా మారింది. దీంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో క్వింటాల్ పత్తికి నాణ్యతను బట్టి రూ.6,500ల వరకు చెల్లిస్తున్నారు.

రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం

జిల్లాలో అయిదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ద్వారా అగ్రిమెంట్ జరిగింది. పత్తి రైతులు తొందరపడి దళారులకు విక్రయించి మోసపోవద్దు. నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి కనీస మద్దతు ధర పొందాలి.

- ప్రకాశ్, జిల్లా మార్కెట్ శాఖ ఇన్‌ఛార్జి అధికారి

తూకాల్లోనూ మోసాలు

గ్రామాల్లో దళారులు తూకాల్లోనూ మోసం చేస్తున్నారు. కొందరు వ్యాపారులు, దళారులు క్వింటాల్‌కు దాదాపు రెండు నుంచి మూడు కిలోలను దోచుకుంటున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఏటా పత్తి సాగుకు పెట్టుబడులు పెరిగి పోతున్నప్పటికీ ఆశించిన మేర దిగుబడులు రాక నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో ఎక్కువ ధర ఆశ చూపి దళారులు తూకంలో మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బండ రాళ్లు, పత్తి బోరాలు ఎత్తుగా వేసి తూకాలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో పత్తి కొనుగోలు చేసే దళారులపై తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో దళారులు ఇష్టారాజ్యంగా రైతుల వద్ద కొనుగోలు చేస్తూ గుట్టు చప్పుడు కాకుండా రైతులను దోపిడీకి గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఆరోగ్యానికి మిద్దె సాగు

■ పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా ఇంటి పరిసరాలు



మిద్దెపై పండ్లు, పూలు, కూరగాయల మొక్కలు

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

తినే ఆహారం, తాగేనీరు, పీల్చే గాలి ఇలా అన్నీ కలుషితం అవుతుండడం.. వాటిని తిన్న వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మంది సొంతంగా మిద్దెపై కూరగాయలు, ఆకుకూరలు పెంచుతూ డబ్బుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

మెట్‌పల్లి పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన చిటికేసి రంజిత్-లాస్య ఇల్లు మొక్కలతో పచ్చదనంగా మారింది. లాస్యకు చిన్ననాటి నుంచి మొక్కలంటే ఎంతో మక్కువ. ఉదయం, సాయంత్రం సమయాన్ని కేటాయిస్తూ వివిధ రకాల మొక్కలను పెంచుతుంది. మిద్దెపై పండ్లు, పూలతో పాటు వివిధ రకాల కూరగాయలను సాగుచేస్తూ ఇంటికి వినియోగించుకుంటూనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటున్నారు. మిద్దెపై ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసుకొని జామ, అంజీరా, మామిడి, దోస, సపోట, పండ్ల మొక్కలతో పాటు టమాట, చిక్కుడు, బీర, సోర, కాకర, పొట్లకాయ, మిరపకాయ, బెండ, వంకాయ లాంటి కూరగాయలతో పాటు వివిధ రకాల గులాబీ, గన్నేరు, మల్లే, చామంతి, బంతి పూల మొక్కలను పెంచుతున్నారు. ఇంట్లో వాడి పడేసిన నూనె డబ్బాలు, వాటర్ బాటిళ్లతో పాటు వివిధ ప్లాస్టిక్ డబ్బాలను సేకరించి వాటికి రంగులు వేసి మొక్కలను పెంచుతూ వాటిని ఇంటి ముందు వేలాడదీశారు. నిత్యం ఇంట్లో వెలువడే కూరగాయలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ఎరువును మొక్కలకు అందిస్తుండడంతో రసాయన ఎరువుల వినియోగం లేకుండా మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో ఇంట్లో లభించే వాటితో డబ్బులు ఆదా చేసుకుంటున్నారు.



లాస్య-రంజిత్ దంపతులు



కబడ్డీలో తలపడుతున్న సిరిసిల్ల-వీణవంక జట్లు

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలు

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ మహాత్మా జ్యోతిబా పులే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జరుగుతున్న బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్‌లో కబడ్డీలో సిరిసిల్ల, వీణవంక జట్లు తలపడగా సిరిసిల్ల జట్టు గెలుపొందింది. ఖోఖోలో కొత్తపల్లి, సైదాపూర్ తలపడగా కొత్తపల్లి జట్టు, వాలీబాల్‌లో స్తంభంపల్లి, గంగాధర తలపడగా స్తంభంపల్లి జట్టు గెలుపొందాయి. లాంగ్ జంప్‌లో సైదాపూర్, వీణవంక పాఠశాలల విద్యార్థులు సాయిచరణ్, కౌశిక్‌లు విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. విజేతలను పాఠశాల ప్రధానాచార్యులు జక్కని రాజేశం, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

మెరిసిన ప్రతిభ.. విరిసిన సృజన



పోటీల్లో పాల్గొన్న గీతాంజలి పాఠశాల విద్యార్థులు

గోదావరిఖని గాంధీ నగర్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు ‘అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం’ అనే అంశంపై వ్యాసరచన నిర్వహించారు. ఈ పోటీల్లో పదోతరగతి విద్యార్థులు కె.యజ్ఞేశ్వర్ ప్రథమస్థానం, ఎండీ అక్తర్‌రజా ద్వితీయ, ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం.వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌లు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. - న్యూస్‌టుడే, మార్కండేయకాలనీ



విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసిన పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్





‘ఈనాడు’ ఆధ్వర్యంలో పెద్దపల్లి మండలం పెద్దకల్వల నోబెల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ‘ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అంశంపై పోటీ నిర్వహించగా శ్రీవైష్ణవి ప్రథమ, రిషిక ద్వితీయ, అభినయ తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మోహన్ రాజా, ప్రధానోపాధ్యాయురాలు ప్రణీత తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 8వ, 9వ, 10వ తరగతుల విద్యార్థులకు ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ‘అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం’ అంశంపై గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించగా... పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో విద్యార్థిని షాలీమ్(పదోతరగతి), ద్వితీయ స్థానం నాగరోహిత్ (ఎనిమిదో తరగతి), తృతీయ స్థానంలో అజయ్‌కుమార్ (తొమ్మిదో తరగతి) నిలిచారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ సూర్యదేవర వెంకటేశ్వర్ రావు, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, భాగ్యలక్ష్మి, లక్ష్మి తదితరులున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. - న్యూస్‌టుడే, మార్కండేయకాలనీ



విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన పాఠశాల నిర్వాహకులు



వ్యాసరచన పోటీల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వీర్లపల్లి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

ఫెర్టిలైజర్ సిటీ, న్యూస్‌టుడే: ఫెర్టిలైజర్ సిటీ నుంచి లక్ష్మీపురం మీదుగా వీర్లపల్లి, మైటెంక్లయిన్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ‘బురద దారిలో అవస్థల ప్రయాణం’ శీర్షికన ‘ఈనాడు’లో ఇటీవల ప్రచురితమైన కథనానికి నగరపాలక అధికారులు స్పందించారు. తాత్కాలిక మరమ్మతులతో గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులతో ఈ రోడ్డులో తారు రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తామని నగరపాలక ఇంజినీరింగ్ అధికారి తెలిపారు.



వీర్లపల్లి రోడ్డులో గుంతలను పూడ్చుతున్న దృశ్యం

సమర్థవంతమైన టీఎల్ఎంను వినియోగించండి

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలంలోని పుట్నూరు, జయ్యారం, కుక్కలగూడూరు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం పర్యటించారు. పుట్నూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పుట్నూరులోని కేజీబీవీ, జయ్యారంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను, కుక్కలగూడూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠ్యాంశాల బోధనకు ఉపాధ్యాయులు సమర్థవంతమైన టీఎల్ఎం లను వినియోగించాలన్నారు.

✦ అంతర్గాం మండలంలోని బ్రహ్మణపల్లి లంబాడి తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని, రామగుండం పట్టణంలోని ఐటీఐని కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ చేశారు.



కుక్కలగూడూరు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కారుణ్య నియామక ఉద్యోగుల శిక్షణ ప్రారంభం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు సూచించారు. సింగరేణిలో విధులు నిర్వహిస్తూ వివిధ అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన, మృతి చెందిన ఉద్యోగుల డిపెండెంట్లకు కారుణ్య నియామక ఉత్తర్వులను ఇటీవల జారీ చేశారు. అందులో 31 మందికి, వివిధ కారణాలతో డిస్మిస్ అయి, తిరిగి బదిలీ వర్కర్లుగా నియమితులైన 11 మంది ఉద్యోగులకు సెంటినరీకాలనీ ఎంవీటీసీలో శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. జీఎం మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని సంస్థలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, డీవైఈ శ్రీనివాస్, శిక్షకుడు వీరన్న పాల్గొన్నారు.



శిక్షణ అభ్యర్థులతో జీఎం వెంకటేశ్వర్లు, అధికారులు

గోదావరిఖని: సింగరేణి ఆర్జీ-1 ప్రాంతంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్‌తో పాటు చనిపోయిన కార్మికుల వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను జీఎం లలిత్‌కుమార్ గురువారం అందజేశారు. 11 మంది పురుషులు, ఏడుగురు మహిళలు వారసులుగా ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తి చూపడంతో వారికి నియామక పత్రాలను అందజేశారు. కొత్తగా ఉద్యోగంలో చేరే వారసులు పని నైపుణ్యం పెంపొందించుకోవాలని, సంస్థలో అంకిత భావంతో పనిచేసి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రామ్మోహన్, కిరణ్‌బాబు, రవీందర్ రెడ్డి, శ్రావణ్‌కుమార్, హన్మంత రావు, గుర్తింపు, అధికారుల సంఘం నాయకులు శ్రీనివాస్, రాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలతో వారసులు, చిత్రంలో జీఎం లలిత్‌కుమార్

ఒప్పంద కార్మికులకు న్యాయం చేయాలి

సింగరేణి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఏఎల్‌పీ గనిలో పని చేస్తున్న ఒప్పంద కార్మికుల కుటుంబాలను సింగరేణి రోడ్డున పడేయడం సరికాదని ఐఎన్‌టీయూసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు ఉడత శంకర్ అన్నారు. సెంటినరీకాలనీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జేఎంఎస్, జెమ్‌కో, వెంకటసాయి ఉపరితల బెల్ట్ క్లీనింగ్ కంపెనీల్లో పని చేసే కార్మికుల్లో టెండరు ప్రతిపాదనలో ఉన్న వారిలో 50 శాతం మాత్రమే పనులకు రావాలని, మిగతా వారు అవసరం లేదని చెబుతున్నారన్నారు. ప్రతిపాదన ప్రకారం తక్కువ తీసుకున్నా, మిగిలిన కార్మికులకు మస్టర్ కట్టించి న్యాయం చేయాలని కోరారు. మల్లూరి మల్లారెడ్డి, పాంచాల కృష్ణమూర్తి, ధర్మల కుమార్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక చర్యలు

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గోదావరిఖని ఏసీపీ రమేశ్ కోరారు. వైద్య కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ర్యాగింగ్ నిరోధక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులపై నిఘా ఉంచి కేవలం చదువుపట్లనే శ్రద్ధ వహించేలా ప్రొఫెసర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ఎలాంటి శిక్షలుంటాయో వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు సింగ్ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు విద్యార్థులను గమనిస్తూ, వారిలో క్రమశిక్షణ పెంచేలా చర్యలు తీసుకునేందుకు కమిటీకి బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. గోదావరిఖని ఒకటో, రెండో పట్టణ సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాదరావు, కళాశాల ఆచార్యులు అనంతబాబు, రాహుల్, కల్పన, అశోక్‌తో పాటు వార్డెన్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్, పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందుసింగ్ తదితరులు

ఉత్తమ వైద్యులుగా ఎదగాలి

గోదావరిఖని ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఉత్తమ వైద్యులుగా ప్రజలకు సేవలందించేలా ఎదగాలని గోదావరిఖని ఏసీపీ రమేశ్ అన్నారు. కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మాయిలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా షీటీంకు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నదాత సంక్షేమానికే అధిక ప్రాధాన్యం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికే తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. గురువారం ఆయన పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పశుసంవర్ధక శాఖకు చెందిన 21వ అఖిల భారత పశుగణన ప్రచార పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పెద్దపల్లి మండలం, పట్టణానికి చెందిన 115 మందికి రూ.1,15,13,340 విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 301 మంది సీఎం సహాయనిధి లబ్ధిదారులకు రూ.80,58,000 విలువైన చెక్కులను అందజేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

పట్టణంలోని 5, 6, 7 వార్డుల్లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1,75,85,000తో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగుకాలువల పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భూ సేకరణ సమస్యలకు సత్వర పరిష్కారం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: భూ సేకరణ సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. గురువారం ఆయన రామగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారంపేట, రాజాపూర్‌లలో భూసేకరణ సంబంధించి ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయిందని, అవార్డులపై రైతులు అందించే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ రాంచంద్రరావుకు సూచించారు. ఎంపీడీవో శైలజ రాణి, ఆర్ఐ నిహారిక పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కమాన్‌పూర్: కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ గురువారం సందర్శించారు. భూ రికార్డులు పరిశీలించి, సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని తహసీల్దార్‌కు సూచించారు.

పొద్దు తిరుగుడు విత్తనాల పంపిణీ

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయాధికారి బి.ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా పొద్దు తిరుగుడు విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంట మార్పిడి ప్రాముఖ్యత, నూనె గింజల పంటలను పండిచటం వల్ల కలిగే లాభాలను వివరించారు. కేంద్ర నూనె గింజల మిషన్ పథకంలో భాగంగా పొద్దు తిరుగుడు విత్తనాల్లో హైబ్రీడ్ రకం అధిక దిగుబడి ఇస్తుందన్నారు. పొద్దు తిరుగుడు పంట సాగుకు ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుందన్నారు. ఎర్ర చెలుక, ఇసుక, రేగడి, ఒండ్రు నేలలు పంటకు అనుకూలమైనవన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.7250గా ఉందని, రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

హామీల అమలుపై చిత్తశుద్ధి ఏదీ!

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పెద్దపల్లిలోని నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వానాకాలం వరి కోతలు ప్రారంభమైనప్పటికీ రైతుభరోసా జాడ లేదన్నారు. పంట రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదన్నారు. నిరుద్యోగ భృతిపై స్పష్టత లేదన్నారు. కొనుగోలు చేసిన సన్న ధాన్యానికి బోనస్ చెల్లించాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టికెట్ కోసం పార్టీకి దరఖాస్తు చేసినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. సమావేశంలో పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, రామ్‌సింగ్, జక్రధర్ రెడ్డి, రవీందర్, క్రాంత్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

ఎన్నికలైన రెండేళ్లకు ఓట్ల లెక్కింపు

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం-మంగపేట మత్స్య సహకార సంఘం ఎన్నికల ఓట్ల లెక్కింపును గురువారం పోలీసు బందోబస్తు మధ్య చేపట్టారు. 2022 ఆగస్టు 1న సంఘం ఎన్నికలు నిర్వహించగా అప్పట్లో ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేయడంతో ఫలితాల వెల్లడిని నిలిపివేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఓట్ల లెక్కింపు చేపట్టలేదు. రెండేళ్ల తర్వాత ఈ నెల 21న కోర్టు నుంచి ఎన్నికల ఫలితాలు వెల్లడించవచ్చని తీర్పు వచ్చింది. ఈ మేరకు గురువారం అధికారులు సహకార సంఘం కార్యాలయంలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. గెలుపొందిన 9 మంది డైరెక్టర్ల పేర్లను ఎన్నికల అధికారి పల్కల సురేందర్‌రెడ్డి ప్రకటించి ధ్రువపత్రాలు అందజేశారు. శుక్రవారం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టగా ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



గెలుపొందిన డైరెక్టర్లతో అధికారులు

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: కాల్వశ్రీరాంపూర్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో గురువారం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్లలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసైతే వారికి సమాజంలో జరుగుతున్న విషయాలు తెలియజేసి మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడానికి కృషి చేయాలన్నారు. వైద్యులు మహేందర్, శ్రీనివాస్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం సరోజన, ఆశా కార్యకర్తలు శారద, మౌనిక, భూలక్ష్మి, సరోజన పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగం, రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.స్వప్నరాణి సూచించారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో తెలియని లింక్‌లు ఓపెన్ చేయొద్దని, సైబర్ మోసాలు జరిగితే అర గంటలోపే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులకు న్యాయ సహాయం అవసరమైతే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 15100 ద్వారా ఉచితంగా పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనర్సయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వప్నరాణి

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: తితిదే ఆధ్వర్యంలో గురువారం సుల్తానాబాద్ శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. తితిదే ధర్మప్రచార పరిషత్ సభ్యుడు మెంగని చంద్రశేఖర్, ప్రధానాచార్యుడు కమలాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ముత్తారం, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరుగుతున్నాయని ముత్తారం ఎంపీడీవో సురేశ్ అన్నారు. గురువారం ఆయన హరిపురంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జిల్లలపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

మొక్కుబడిగా పశువైద్య సేవలు

న్యూస్‌టుడే, ధర్మారం: మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో సేవలు నామమాత్రంగా మారాయి. మూగజీవాలను తోలుకొని వస్తే సరైన చికిత్స అందక, సలహాలు కూడా దొరకక పోషకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధర్మారానికి చెందిన దేవి తిరుపతికి చెందిన ఆవుకు గురువారం ఎద లక్షణాలు కనిపించడంతో కృత్రిమ గర్భధారణ కోసం తోలుకొచ్చారు. పశు వైద్యాధికారి అందుబాటులో లేకపోగా ఆఫీస్ సబార్డినేట్ ఒక్కరే ఉన్నారు. పశువైద్యాధికారి డా.అజయ్‌కుమార్‌ను తిరుపతి ఫోన్‌లో సంప్రదించగా తన కారు మొరాయించినందున రావడం కుదరదని చెప్పడంతో ఆవేదనకు గురయ్యారు. ఎదకు వచ్చిన రోజే కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఫలితం ఉంటుందని వాపోయారు. తిరుపతి అందించిన సమాచారంతో ‘న్యూస్‌టుడే’ సమస్యను పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లగా ఖిలావనపర్తిలో ఉన్న జేవీవో రాజేందర్‌ను ధర్మారం రప్పించి కృత్రిమ గర్భధారణ చేయించేలా చర్యలు చేపట్టారు. ధర్మారంలో పశువైద్యాధికారితో పాటు వెటర్నరీ అసిస్టెంట్(వీఏ) పోస్టులున్నాయి. దొంగతుర్తిలో ఎల్ఎస్ఏ(లైవ్ స్టాక్ అసిస్టెంట్) పోస్టు ఖాళీగా ఉండటంతో ధర్మారం వెటర్నరీ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై పంపించారని డా.అజయ్‌కుమార్ తెలిపారు. తాను సెలవులో ఉన్నపుడు పాడి రైతులకు అసౌకర్యం కలుగుతోందని చెప్పారు.



ధర్మారం పశువైద్యశాల వద్ద ఆవుతో రైతు తిరుపతి

సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య



నర్సయ్య

గోదావరిఖని, న్యూస్‌టుడే: గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి మాదంశెట్టి నర్సయ్య(58) పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి ఓసీపీలో ఈపీ ఆపరేటర్‌గా పనిచేసే నర్సయ్య ఏడు సంవత్సరాల క్రితం కరీంనగర్ బైపాస్ రోడ్డులో ఓ స్థలం కొనుగోలు చేశాడు. వివాదంలో ఉన్న విషయం తెలియక రూ.20 లక్షల వరకు అప్పుచేసి చెల్లించాడు. వివాదం కోర్టులో ఉంది. విషయం ఎటూ తేలకపోగా అమ్మిన వ్యక్తి డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని ఈనెల 22న కుటుంబ సభ్యులకు చెప్పి మనస్తాపానికి గురయ్యాడు. 23వ తేదీ తెల్లవారు జామున నర్సయ్య ఒక్కసారిగా వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు ప్రశ్నించగా పురుగుమందు తాగినట్లు చెప్పాడు. వెంటనే అతన్ని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెండాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నేత్రదానంపై సదాశయ ఫౌండేషన్ సభ్యులు అవగాహన కల్పించడంతో నర్సయ్య నేత్రాలను దానం చేసేందుకు అతని కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో ఆయన నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.

రాణాల్లో ఆయుధాల ప్రదర్శన

మంథని, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం మంథని ఠాణాలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 డయల్, హ్యాక్ఐ, సైబర్ క్రైమ్, పోలీసుల పని విధానంపై గోదావరిఖని ఏసీపీ రమేశ్ అవగాహన కల్పించారు. ఆయుధాల పనితీరుపై వివరించారు. సీఐ రాజు, ఎస్సై రమేశ్, ఏఎస్సైలు పాల్గొన్నారు.



మంథనిలో ఆయుధాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ఠాణాను గురువారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుల పని విధానం, ఆయుధాల వినియోగం తదితర అంశాలపై ఎస్సై ప్రసాద్ వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి(అంతర్గాం): అంతర్గాం మండలం మద్దిర్యాలకు చెందిన మాటేటి శంకర్ మంచిర్యాల జిల్లా వేంపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

గోదావరిఖని: స్థానిక బాపూజీనగర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ మహంకాళి స్వామి తెలిపారు. శ్రీకాంత్ డెంటల్ ఆస్పత్రి సహకారంతో ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

భారాస పాలనలోనే అభివృద్ధి

రామగుండం: భారాస హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని పార్టీ రామగుండం పట్టణ అధ్యక్షులు బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామగుండం పట్టణంలో ప్రజల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. దీని కోసం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, గంగాధర్, సారయ్య, వేణు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కర్మాగార క్యాంటీన్ పరిశీలన

పాలకుర్తి: పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ కర్మాగారం క్యాంటీన్‌ను కర్మాగార సీవోవో (చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్) అభయ్ దాదీచ్ గురువారం పరిశీలించారు. కార్మికులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవీపీ హెచ్ఆర్ అండ్ ఐఆర్ అధికారి పార్థసారథి, కేశోరాం ఒప్పంద కార్మిక గుర్తింపు సంఘం అధ్యక్షుడు కౌశిక హరి, ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లులో తనిఖీలు

పెద్దపల్లి: పెద్దపల్లి రాఘవాపూర్‌లోని శ్రీరామ జిన్నింగ్ మిల్లులో గురువారం మార్కెటింగ్ అధికారులు తనిఖీ నిర్వహించారు. రైతులు తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతాన్ని పరిశీలించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకొచ్చే రైతులు తేమ శాతం 8-12 వరకు ఉండేలా చూసుకోవాలన్నారు. తేమ శాతం పెరిగితే ధర తగ్గడంతో పాటు పత్తి నాణ్యత పడిపోతుందన్నారు. మార్కెట్ కార్యదర్శి పృథ్వీరాజ్, మిల్లు నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు బస్సులు వేయాలని వినతి

ముత్తారం, న్యూస్‌టుడే: దర్యాపూర్ ఆదర్శ పాఠశాలకు నడిపే రెండు ఆర్టీసీ బస్సులు విద్యార్థుల సంఖ్యకు సరిపోవడం లేదని, అదనంగా మరో బస్సు వేయాలని కోరుతూ పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్ గురువారం మంథని డీఎం శ్రవణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. త్వరలో డిపోకు కొత్త బస్సులు రానున్నందున నడిపించే యత్నం చేస్తామని డీఎం హామీ ఇచ్చారని ప్రిన్సిపల్ తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, సునీత స్వప్న, పాల్గొన్నారు.

సామాజిక భవనానికి స్థలం కేటాయించాలి

మంథని: మంథని పట్టణంలో బీసీ సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి కిషన్‌జీ గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్ వికె రవి, మోహన్ పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

సుల్తానాబాద్: ఎలిగేడు మండలం నారాయణపల్లిలో గురువారం 50 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యురాలు ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ ఎంఈవోకు సన్మానం

జూలపల్లి, న్యూస్‌టుడే: మండల ఇన్‌ఛార్జి విద్యాధికారిగా పని చేసిన గర్రెపల్లి జడ్పీ పాఠశాల హెచ్ఎం వి.కవితను గురువారం జూలపల్లి మండల వనరుల కేంద్రంలో సన్మానించారు. ఎంఈవో సరస్వతి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీలు పాల్గొన్నారు.



ఎంఈవో కవితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామాలయంలో అభిషేకం

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలోని కోదండ రామాలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు ఆరుట్ల హరీశాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి మూలవిరాట్టుకు పంచామృతంతో అభిషేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు